నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, గురువారం 21 నవంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

విద్యతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం

● ఎంజీయూ వీసీ-ఖాజా అల్తాఫ్ హుస్సేన్

రామగిరి, నవంబర్ 20: విద్యతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పించి జీవితంలో స్థిరపడేలా చేసేందుకు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. నల్లగొండలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ ప్లేస్ మెంట్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీలో నిర్వహించిన జాబ్‌మేళాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు సబ్జెక్టు నైపుణ్యాలతోపాటు ఉద్యోగ సాధనకు అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఉమ్మడి జిల్లాతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 600 మంది అభ్యర్థులకు సాఫ్ట్‌వేర్, నాన్ సాఫ్ట్‌వేర్ సంబంధించిన 25 కంపెనీల ప్రతినిధులు ఇంటార్వ్యూలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేసి ఆఫర్ లెటర్లు అందించారు. కార్యక్రమంలో ఎంజీయూ ప్లెస్‌మెంట్ సెల్ అధికారి వై.ప్రశాంతి, వివిధ విభాగాల అధికారులు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

చేపా చేపా.. ఎక్కడికెళ్లావ్..?

తూతూమంత్రంగా ఉచిత చేప పిల్లల పంపిణీ

- ఈ ఏడాది ఆలస్యంగా పథకం ప్రారంభం
- బీఆర్ఎస్ హయాంలో ఏటా 3 కోట్ల చేప పిల్లలు
- సీడ్‌ను 1.5కోట్లకు కుదించిన కాంగ్రెస్ సర్కార్
- ఇప్పటి వరకు చెరువుల్లోకి వదిలింది 50 లక్షలే..
- అందులోనూ నాసిరకం సీడ్ వేశారని ఆరోపణలు
- మిగతా చేప పిల్లల పంపిణీ ఎగనామమేనా..?
- ప్రభుత్వ తీరుతో మత్స్యకారుల ఉపాధికి దెబ్బ

చేప పిల్లల పంపిణీలో కాంగ్రెస్ సర్కార్ మోసం కొనసాగుతూనే ఉన్నది. ఇప్పటికే సకాలంలో చేపల పంపిణీ చేపట్టకుండా చేష్టలూడి చూస్తున్నది. బీఆర్ఎస్ హయాంలో వదిలిన చేప పిల్లల్లో సగానికి కుదించి మత్స్యకారుల ఉపాధిపై గుడిబండ మోపుతున్నది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్దేశించిన ఆ లక్ష్యాన్ని కూడా చేరకుండా చేతులెత్తేస్తున్నది.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ)

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల కుటుంబాల్లో వెలుగులు విరజిమ్మాయి. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మత్స్యకారులకు ప్రభుత్వ పథకాలు కొనసాగాయి. ఇందులో భాగంగా ఉచిత చేప పిల్లల పంపిణీ సమర్థంగా అమలు చేశారు. గతేడాది వరకు వానకాలం సీజన్ ప్రారంభం కాకముందే చేప పిల్లల పంపిణీ కోసం ఏర్పాట్లు జరిగేవి. జూన్ ప్రారంభంలోనే టెండర్లను ఆహ్వానించి ఫైనల్ చేసేవారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పండుగ వాతావరణంలో చెరువుల్లోకి సీడ్‌ను వదిలేవారు. సెప్టెంబర్ వరకు సీడ్ వేస్తేనే మంచి ఎదుగుదల వస్తుంది. ఆలస్యమైతే చేపల ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. కానీ ఈ సారి మాత్రం పరిస్థితి తారుమారైంది. ప్రభుత్వ అలసత్వంతో ఆలస్యంగా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్టోబర్ రెండో వారంలో అట్టహాసంగా ప్రారంభించి.. మమ అనిపించారు. ఫలితంగా మత్స్యకారుల జీవితాల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి.

50లక్షల సీడ్ తోనే సరి..!

కేసీఆర్ హయాంలో సక్రమంగా సాగిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం కాంగ్రెస్ సర్కారులో చతికిలపడింది. జిల్లాలో సుమారు 800కిపైగా చెరువులు ఉన్నాయి. కొన్నేండ్లుగా కొన్ని చిన్న చెరువులు పోగా.. ఏటా 650 చెరువుల్లో చేప పిల్లలను వదులుతున్నారు. ఈసారి పరిస్థితి మారింది. 400 చెరువుల్లోనే సీడ్ వేయాలని నిర్ణయించినా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. గతంలో ఏటా జిల్లాలో మూడు కోట్ల చేప పిల్లలను పంపిణీ చేసేవారు. ఈ సారి ఉచిత చేప పిల్లల పంపిణీ సగానికి తగ్గించారు. 1.50కోట్ల చేప పిల్లలను చెరువుల్లోకి వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పుడు దాన్ని కూడా పూర్తి చేయని పరిస్థితి నెలకొంది. కేవలం 50లక్షల సీడ్‌ను మాత్రమే పంపిణీ చేశారు. ఇంకా 5లక్షల వరకు పంపిణీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. మిగతా 80లక్షల సీడ్ కు ఎగనామం పెట్టే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. కాంట్రాక్టర్లు రావడం లేదనే సాకుతో ఇక్కడితో ముగించే ప్లాన్ చేస్తున్నారు.

జిల్లాలో రెండు రకాల చేప పిల్లలను చెరువుల్లో వేసేవారు. కానీ ఈ సారి మాత్రం 1.30కోట్లకు కుదించారు. ఇందులో 80మిల్లీమీటర్ల సైజ్ ఉన్న చేపల పిల్లలు కోటి కాగా, 35 మిల్లీమీటర్ల సైజ్‌వి 50 లక్షలు వేయాలని నిర్ణయించారు. కానీ 10 లక్షలు చిన్న సైజ్, 40 లక్షలు పెద్ద సైజ్ సీడ్‌ను చెరువుల్లోకి వదిలారు. చేప పిల్లల సరఫరాలో కాంట్రాక్టర్లు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారంటూ జిల్లాలోని మత్స్య కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉచితంగా చేపపిల్లలు ఇచ్చామని చెప్పుకోడానికే తప్ప ఉపయోగం లేదంటున్నారు. ముఖ్యంగా పరిమాణం విషయంలో ఒప్పందాలను ఉల్లంఘిస్తున్నారని, ఇది ఉత్పత్తిని దెబ్బ తీస్తుందని వాపోతున్నారు. ఇవి బతుకుతాయని, తమ బతుకులు బాగు చేస్తాయన్న గ్యారెంటీ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు చెరువుల్లో వదిలిన చేప పిల్లలకు రికార్డుల్లో లెక్కలకు చాలా తేడాలు ఉన్నాయనే ఆరోపణలు కూడా బలంగా వినిపిస్తున్నాయి.

నాసి రకం చేప పిల్లలు..

మత్స్యకారుల ఉపాధికి దెబ్బ..

బీఆర్ఎస్ పాలనలో మిషన్ కాకతీయ కార్యక్రమంలో భాగంగా చెరువుల్లో పూడికతీత చేపట్టారు. దాంతో చెరువులు జలకళను సంతరించుకొని నిండుకుండలా తొణికిసలాడాయి. ఉచిత చేపల పిల్లల పంపిణీతో ఎంతో మందికి ఉపాధి లభించింది. మత్స్యకారులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. జిల్లాలో 186 మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. వాటి ద్వారా 10వేల మంది వరకు మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారు. వీరే కాకుండా సభ్యత్వాలు లేనివారు, పరోక్షంగా మరికొందరికి ఉపాధి లభిస్తున్నది. కానీ ఇప్పుడు చెరువులు, సీడ్ లేకపోవడంతో మత్స్యకారుల ఉపాధిపై దెబ్బ పడింది.

ఆలేరులో సీడ్ వేయలేదు..

ప్రభుత్వం ఆలేరు మండలంలో ఏ చెరువులో కూడా చేపలను వేయలేదు. ఆలేరు పట్టణ పరిధిలోని ఆరో వార్డు బహదూర్ పేటలోని పెద్ద చెరువులో సీడ్ వదల్లేదు. కాంట్రాక్టర్లు నాణ్యత లేని నాసిరకం చేపలను చెరువులో వేస్తున్నారు. దీని వల్ల ఉత్పత్తి, ఎదుగుదలపై ప్రభావం చూపుతున్నది. చేప పిల్లలు చనిపోతాయి.

- కొలుపుల హరినాథ్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు

నేడు జిల్లా మీదుగా కేటీఆర్ రాక

● స్వాగతం పలికేందుకు బీఆర్ఎస్ శ్రేణుల సన్నద్ధం

నల్లగొండ ప్రతినిధి, నవంబర్20(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు గురువారం ఉమ్మడి నల్లగొండ జిల్లా మీదుగా ప్రయాణించనున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న గిరిజన రైతుల మహాధర్నాలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి బయల్దేరి వెళ్లనున్నారు. అక్కడి నుంచి చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూరు, నకిరేకల్ మీదుగా అర్వపల్లి, తుంగతుర్తి మండలాల గుండా ప్రయాణిస్తూ మరిపెడ బంగ్లా వద్ద మహబూబాబాద్ జిల్లాలోకి అడుగుపెట్టనున్నారు. ఈ సందర్భంగా యువనేత కేటీఆర్ ప్రయాణం ఉమ్మడి జిల్లా పరిధిలోని పలు మండలాల మీదుగా సాగనుండడంతో ఆయా ప్రాంతాల్లోని బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికేందుకు సన్నద్ధం అవుతున్నారు. మునుగోడు నియోజకవర్గానికి సంబంధించి చౌటుప్పల్‌లో, నకిరేకల్‌కు సంబంధించి చిట్యాలలో, తుంగతుర్తికి సంబంధించి అర్వపల్లిలో కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు స్థానిక మాజీ ఎమ్మెల్యేల నేతృత్వంలో పార్టీ నేతలు, కార్యకర్తలు సిద్ధమయ్యారు. ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌లో బయల్దేరనున్న కేటీఆర్ చౌటుప్పల్‌కు 8గంటల వరకు చేరుకుని, అక్కడ నుంచి ఆ తర్వాత ఆయా మండలాల మీదుగా జిల్లాలో ప్రయాణించనున్నట్లుగా పార్టీ నేతలు తెలిపారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు కూడా పాల్గొననున్నారు.

నకిరేకల్ బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రేవంత్‌రెడ్డి ఓ రోత ముఖ్యమంత్రి

- ● ఆయన భాష పశువుల కాపరి కంటే ఘోరం
- ● కాంగ్రెస్‌ది ఫెయిల్యూర్ ప్రభుత్వం
- ● నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, నవంబర్ 20 : వరంగల్ సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరు పశువుల కాపరి కంటే ఘోరంగా ఉందని, ఆయన ఓ రోత ముఖ్యమంత్రి అని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. రుణమాఫీ సంబురాలకు పార్టీ అధినేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఎవరూ రాలేక పోయారని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి దమ్ముంటే ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏం ఉద్ధరించావని విజయోత్సవ సభలు చేస్తున్నావ్? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డిది ఫెయిల్యూర్ ప్రభుత్వమన్నారు. తప్పుడు లెక్కలు చూపించుకుంటూ రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం కేసీఆర్ ప్రాణాలను ఫణంగా పెట్టి రెండు పర్యాయాలు ముఖ్యమంత్రి అయ్యి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారన్నారు. రేవంత్‌రెడ్డి అదానీ, అంబానీలతో చేతులు కలిపి పేదల ప్రజల భూములను లాక్కొని కెమికల్ ఫ్యాక్టరీలకు కట్టబెడుతున్నాడని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సర్కారు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తి చేశారని, అందుకే ప్రజలు విజయోత్సవాలు చేశారని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏడాదిలో ఒక్క హామీ కూడా అమలు చేయలేదని, దమ్ముంటే ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అబద్ధాలతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని దుయ్యబట్టారు. ఫార్మా పేరుతో రైతులపై అక్రమ కేసులు పెడుతున్నందుకు చేస్తున్నారా? రైతు రుణమాఫీ ఎగ్గొటినందుకా? పింఛన్లు పెంచుతామని చెప్పి తప్పినందుకా? లగచర్లలో ప్రజలను అవస్థలు పెడుతున్నందుకా? ఎందుకు విజయోత్సవ సభలు చేస్తున్నారని నిలదీశారు. రేవంత్‌రెడ్డి పాలనను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను తిట్టడం మాని హామీల అమలుపై దృష్టి సారించాలని హితవు పలికారు. సమావేశంలో బీఆర్ఎస్ నకిరేకల్ మండలాధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మాద నగేశ్‌గౌడ్, గొర్ల వీరయ్య, సామ శ్రీనివాస్‌రెడ్డి, పెండెం సదానందం, యానాల లింగారెడ్డి, రాచకొండ వెంకన్న, దైద పరమేశం, పల్లె విజయ్, గుర్రం గణేశ్, దైద అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

విమానగోపురం బంగారు తాపడాలకు పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ హనుమంత రావు, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఈఓ భాస్కర్‌రావు

విమాన గోపురం బంగారు తొడుగుల బిగింపు పనులు ప్రారంభం

యాదగిరిగుట్ట, నవంబర్20 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయ దివ్య విమాన గోపురం బంగారు తొడుగుల బిగింపు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్ సంస్థలో మహాద్భుతంగా రూపుదిద్దుకున్న 21 రకాల బంగారు తొడుగులు యాదగిరిగుట్టకు చేరుకోగా, ప్రధానాలయ ముఖ మండపంలో వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్ రావు, కలెక్టర్ హనుమంతరావు, ఈవో భాస్కర్‌రావు, అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం స్తపతి రవీంద్రన్ ఆధ్వర్యంలో విమాన గోపురానికి బంగారు తొడుగుల బిగిం పు ప్రక్రియను చేపట్టారు. త్వరలో మరిన్ని బంగారు తొడుగులు యాదగిరిగుట్టకు చేరుకుంటాయని, వచ్చిన వెంటనే విమానగోపురానికి బిగింపు చేపట్టనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

తుంగతుర్తిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్

రైతులను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

- ● హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డి
- ● తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్

తుంగతుర్తి, నవంబర్ 20 : ఎన్నికల సమయంలో ప్రతి రైతుకూ రుణమాఫీ చేస్తామని, రైతుభరోసా ఇస్తామని హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అన్నదాతలను దగా చేసిందని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని అన్నారం గ్రామంలో బుధవారం ఆయన సీఎస్ఐ చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా రేవంత్‌రెడ్డి దుర్మార్గపు పాలన కొనసాగిస్తున్నారని, రేవంత్‌రెడ్డిపై నమ్మకం లేక రైతులంతా దళారులు, మిల్లర్లకు అమ్ముకుంటున్నారని విమర్శించారు. గతంలో పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ ధాన్యం ఇవ్వాలని, బ్యాంక్ గ్యారెంటీల పేరుతో మిల్లర్లను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు కాక రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో తుంగతుర్తి నియోజకవర్గంలో 78వేల టన్నుల ధాన్యం దిగుబడి అయితే ఈ ప్రభుత్వంలో దిగుబడి తగ్గిందన్నారు. మాజీ కేసీఆర్ కంటే గొప్పగా ఏదో చేస్తారని పొరపాటున ప్రజలు నమ్మి గెలిపిస్తే వాళ్ల రక్తాన్ని తాగుతున్న వ్యక్తి రేవంత్‌రెడ్డి అని, కేసీఆర్ మహావృక్షం అని, పీకే దమ్ము ఎవరికీ లేదని తెలిపారు. మూసీ ప్రక్షాళనకు బీఆర్ఎస్ వ్యతిరేకం కాదని, ప్రక్షాళన పేరుతో మీరు చేస్తున్న అవినీతి, దోపిడీని వ్యతిరేకిస్తున్నామని, మూసీ ప్రక్షాళనను కేసీఆర్ ప్రభుత్వంలో రూ.16వేల కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. మూసీ ప్రక్షాళన పేరుతో రేవంత్‌రెడ్డి ఢిల్లీకి డబ్బు సంచులు పంపి సీఎం సీటు కాపాడుకోవడానికి పూటకో మాట మాట్లాడుతున్నారని, ఇప్పటికి 32సార్లు ఢిల్లీకి వెళ్లి, మంత్రివర్గ విస్తరణ చేసే ధైర్యం రేవంత్‌రెడ్డి లేదని ధ్వజమెత్తారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా ద్రోహం చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. తొందరలోనే మోసపూరిత ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈసమావేశంలో బీఆర్ఎస్ పార్టీ తుంగతుర్తి మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, కల్లెట్లపల్లి ఉప్పలయ్య, గుండగాని రాములుగౌడ్, దొంగరి శ్రీనివాస్, గుండగాని దుర్గయ్య గౌడ్, మట్టిపల్లి వెంకట్, కడారి దాసు, ప్రవీణ్, పోతరాజు, రాములు, కడియం సైదులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట: సైదాపురంలో ధాన్యం కొనుగోలు సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

ధరణి, మీ సేవ దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలి

కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట/భువనగిరి కలెక్టరేట్, నవంబర్20 : ధరణి, మీ సేవ దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలని కలెక్టర్ హనుంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట తాసీల్దార్ కార్యాలయం, మండలంలోని సైదాపురంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఆదా యం కుల ధ్రువీకరణ, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి ధృవత్రాలను పెండింగ్ లేకుండా ప్రజలకు సకాలంలో అందజేయాలన్నారు. రైతులు తెచ్చిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసి సకాలంలో చెల్లింపులు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే భువనగిరి తాసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలకు వెళ్లి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు గణిత సబ్జెక్టుపై ప్రశ్నించారు. విద్యార్థి మనోజు సరైన సమాదానం చెప్పడంతో కలెక్టర్ అభినందించారు. చదువులో వెనుకబాటు ఉన్న పిల్లల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. అధికారులు ఉన్నారు.

జిల్లా న్యాయసేవాధికారి సంస్థలో శాశ్వత ఉద్యోగాలకు దరఖాస్తులు

భువనగిరి అర్బన్, నవంబర్ 20 : భువనగిరి కోర్టులోని జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థలో శాశ్వత ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా న్యాయసేవా అధికారి సంస్థ సెక్రటరీ మాధవీ లత బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయసేవా అధికార సంస్థలో స్టెనో పోస్టు ఒకటి ఖాళీ ఉందని, దీనికి డిగ్రీ అర్హతతో పాటు షార్ట్ హ్యాండ్ ఇంగ్లిష్ హయ్యర్ నిమిషానికి 120 పదాల స్పీడ్ ఉండాలన్నారు. టైప్ రైటింగ్‌లో ఇంగ్లిష్ హయ్యర్ నిమిషానికి 45 పదాల టైప్ స్పీడ్ అర్హత కలిగి ఉండాలని తెలిపారు. షార్ట్ హ్యాండ్ ఇంగ్లిష్ లోయర్, టైప్ రైటింగ్ ఇంగ్లిష్ లోయర్ అర్హత ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రికార్డు అసిస్టెంట్ ఒక పోస్టు ఖాళీ ఉందని, పదో తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని, దీని కన్నా అధిక అర్హత ఉన్నప్పటికీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నవంబర్ 13 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని, నవంబర్ 27వ తేదీతో ముగియనుందన్నారు. ఈ పోస్టులకు ఓఎంఆర్ పరీక్ష డిసెంబర్ 7న జరుగుతుందని, పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు స్కిల్ టెస్టు డిసెంబర్ 8 నిర్వహిస్తారని తెలిపారు. స్టెనో ఉద్యోగానికి 40 మార్కులకు ఓఎంఆర్ అధారిత పరీక్ష ద్వారా ఓసీ, ఈడబ్ల్యూఎస్‌లకు 40 శాతం, బీసీలకు 35శాతం, ఎస్సీ, ఎస్టీలకు 30 శాతం అర్హత పొందిన వారికి స్కిల్ టెస్ట్ 40 మార్కులకు ఎగువ తెలిపిన షెడ్యూల్ ప్రకారం పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. రికార్డు అసిస్టెంట్ ఉద్యోగానికి మొత్తం 80 మార్కులను ఓఎంఆర్ అధారిత పరీక్ష ద్వారా ఓసీలకు, ఈడబ్ల్యూఎస్‌లకు 40 శాతం, బీసీలకు 35శాతం, ఎస్సీ, ఎస్టీలకు 30 శాతం మార్కులు వస్తే అర్హత సాధించినట్లు అని తెలిపారు. జిల్లా ఈ-కోర్ట్స్ వెబ్‌సైట్‌లో హాల్ టికెట్స్, ఫలితాలు పొందుపరుస్తామని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఎప్పటికప్పుడు https://yadadri.dcourts.gov.in/ వెబ్‌సైట్ నుంచి సమాచారం పొందడంతోపాటు హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు.

కొనసాగిన ప్రైవేట్ డిగ్రీ కళాశాలల బంద్

రామగిరి, నవంబర్ 20: ఫీజు రీయిబర్స్‌మెంట్ కోసం ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలు చేపట్టిన నిరవధిక బంద్ బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొనసాగింది. ఆయా కళాశాలల వద్ద ప్రత్యేక ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి కళాశాల గేట్లను మూసి వేశారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల అసోసియేషన్ ఎంజీయూ అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సమస్య పరిష్కరించే వరకూ బంద్‌తోపాటు పరీక్షల బహిష్కరణ కొనసాగిస్తామని వెల్లడించారు. తమ పెండింగ్ ఫీజులు చెల్లించి ఆదుకోవాలని కోరారు.

ఎంజీయూ డిగ్రీ పరీక్షలు వాయిదా

రామగిరి : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీ విద్యార్థులకు ఈ నెల 21, 23 నుంచి ప్రారంభంకావాల్సిన 3, 5వ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి జి.ఉపేందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి పరీక్షలు డిసెంబర్ 7, 10 తేదీల నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల నిరవధిక బంద్ నేపథ్యంలో నిర్ణయం చేసినట్లు స్పష్టమవుతుంది

మాధారం కలాన్ గ్రామం వద్ద మిల్లులో పత్తిని అమ్మేందుకు క్యూ కట్టిన ట్రాక్టర్లు

పత్తి కొనుగోళ్లకు రెండు రోజులు

కాటన్ మిల్లు వద్ద రైతుల పడిగాపులు

శాలిగౌరారం, నవంబర్ 20 : ఆరుగాలం శ్రమించి పండించిన పత్తిని అమ్మేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. సీసీఐ అధ్వర్యంలో చేపట్టిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని శాలిగౌరారం మండలంలోని మాధారం కలాన్ గ్రామం టీఆర్ఆర్ కాటన్ మిల్లుకు కేటాయించారు. దాంతో ఇటీవల కొనుగోలు కేంద్రం ప్రారంభం కాగా రైతులు భారీ సంఖ్యలో పత్తిని విక్రయించేందుకు వస్తున్నారు. మండలంతోపాటు నకిరేకల్ మండలం ఓగోడు, నడిగూడెం, పాలెం, అర్వపల్లి మండలం నుంచి కూడా రైతులు వచ్చి ఇక్కడ పత్తిని విక్రయిస్తున్నారు. ప్రతి రోజూ 90నుంచి 100 ట్రాక్టర్ల వరకు భారీ ఎత్తున ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుండడంతో పత్తిని అమ్మేందుకు రెండు రోజులు పడుతుందని రైతులు చెబుతున్నారు. సీసీఐ అధికారులు మ్యాచర్ చూసి కాంటా వేస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. అక్కడే ట్రాక్టర్ల కిందనే కూర్చొని వెంట తెచ్చుకున్న భోజనాన్ని చేస్తున్నారు.